క్లుప్తంగా

పేదలకు అండగా ప్రభుత్వం

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఉండవెల్లి మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన వాసన్న భార్య మాస్టర్ రేణుకకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చులకు రూ. 2.50 లక్షలు మంజూరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

శాంతినగర్: అన్ని కులాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుర్వసంఘం కమ్యూనిటీ హాల్‌కు నిర్మాణానికి మంజూరైన రూ.15 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని ఆ సంఘం నాయకులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఏర్పాటు

రాజోలి: మండల కేంద్రంతో పాటు మాన్‌దొడ్డి గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామస్తులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

గద్వాల క్రైం: వనపర్తి–గద్వాల జిల్లాకు సంబంధించిన కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల అర్హత ధ్రువపత్రాల మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. మొత్తం 500 మందికిగాను 461 మంది హాజరైనట్లు ఎస్పీ సృజన తెలిపారు.

కౌన్సిలర్‌కు సన్మానం

అయిజ: ఉత్తమ కౌన్సిలర్‌గా అవార్డు అందుకున్న గిత్తల దేవరాజ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి మాస్టర్ షేక్షావలి ఆచారి శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు పాండురంగ, బసవరాజ్, సందర్‌రాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల మంజూరు చేయాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఇంటర్ కళాశాలను మంజూరు చేయాలని రైతు సంఘం సభ్యులు ఎమ్మెల్యే అబ్రహం, జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలో వారిని కలిసి సమస్యను విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖ, రైతు సంఘం సభ్యులు ముత్యాల్‌రెడ్డి, కొండన్న, రామ్‌కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్న నాగేంద్రం పాల్గొన్నారు.

బీరప్ప విగ్రహం ఏర్పాటు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో కుర్వ కులస్తుడికి చెందిన బీరప్ప విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం ప్రారంభించారు. మంగళవారం కుర్వ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. గ్రామాభివృద్ధిలో అన్ని కులస్తులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కుర్వ సంఘం సభ్యులు శ్రీరాములు, మద్దిలేటి, సుధాకర్, మల్లన్న, రత్నయ్య, వెంకటేశ్వర్లు, జనార్దన్, సవారన్న, తదితరులు పాల్గొన్నారు.

నేను బతికే ఉన్నా..



సుంకన్న

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన సుంకన్న బతికే ఉన్నా ఆన్‌లైన్‌లో మాత్రం చనిపోయినట్లు చూపిస్తోంది. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి తాత్కాలిక కాలుపై నడుస్తూ జీవనం గడుపుతున్నాడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రానికి వెళ్తే బాధితుడి వివరాలు నమోదు చేయగా మృతిచెందినట్లు చూపిస్తోంది. దీంతో అవాక్కై అధికారులకు నేను బతికే ఉన్నా పింఛన్ మంజూరు చేయండి సారూ అంటూ సుంకన్న వేడుకుంటున్నాడు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

తరగతి గదుల ప్రారంభం

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం, నందిన్నె పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.11 లక్షల నిధులతో నిర్మించిన నూతన గదులను మంగళవారం ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన లైబ్రరీ పుస్తకాలను ఆవిష్కరించారు. నూతన ఫర్నిచర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంఈఓ సురేష్, సర్పంచ్ సూర్యప్రకాష్, చక్రధర్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొండేరులో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం



ఎల్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ధరూరు మండలం జాంపల్లిలో..



గట్టు మండలం చాగదోనలో..

ఊరూరా విద్యా సంబరాలు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని కొండేరులో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో రూ. 17.20 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

మల్దకల్: మండలంలో ఎల్కూరులో విద్యా దినోత్సవం సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.9.81 లక్షలతో నూతనంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జెండా ఎగురవేశారు.

అలంపూర్: పట్టణంలోని ఎమ్మార్సీభవనం, హరిజనవాడ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఎంఈఓ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఆయా పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులకు పుస్తకాలను, విద్యా క్యాలెండర్ పోస్టర్‌లను మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ అందజేశారు.

అలంపూర్ రూరల్: విద్యా దినోత్సం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఎగుర వేశారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం వ్యాసరచన, పాటలు, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా మండలంలోని మద్దూరు, అమరవాయి గ్రామాలలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అబ్రహం హాజరయ్యారు. మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా మద్దూరులో రూ. 17 లక్షలు, అమరవాయిలో రూ. 9.14 చేపట్టిన అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. అనంతరం హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలోఎంపీపీ అశోక్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంఈఓ శివప్రసాద్, నాయకులు వెంకటేశ్వర్లు, కాంతారెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు రేవులపల్లి, మార్లబీడు, జాంపల్లి, అల్వలపాడు, ర్యాలంపాడు, చింతరేవుల, గ్రామాల్లో విద్యా దినోత్సవం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. రేవులపల్లి ఉన్నత పాఠశాలలో చాకలి ఐలమ్మ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

శాంతినగర్: విద్యా దినోత్సవం సందర్భంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ, ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా పాఠశాలల్లో రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

పాఠశాలల రూపురేఖలు మారాయి

రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని టీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

గట్టు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం పురస్కరించుకొని చాగదోన ఉన్నత పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్ యూనిఫాంలను పంపిణీ చేశారు. నూతన రీడింగ్ రూంను ప్రారంభించారు. హెచ్‌ఎం రుక్మతుల్లా, కార్యదర్శి రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బల్గెరలో ప్రాథమిక పాఠశాల, గట్టు ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఉండవెల్లి: విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రం, తక్కశిల పలు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు పాఠశాలలో జాతీయజెండాను ఆవిష్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఒరవడి

ఉండవెల్లి: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించి కొత్త ఒరవడికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అబ్రహం జాతీయ జెండాను ఎగురవేశారు. మన ఊరు–మన బడి కార్యాక్రమంలో భాగంగా రూ.2 కోట్ల 31 లక్షల నిధులతో నిర్మించనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం కలుగోట్ల గ్రామంలోని పాఠశాల నూతన గదులను సర్పంచ్ హురునిస్సాతో కలిసి వారు ప్రారంభించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.9 లక్షల 42 వేల నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.

అయిజ: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం జెండాఆవిష్కరణ చేశారు. ఈడిగోనిపల్లిలో విద్యార్థులకు యూనిఫాం, ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



అలంపూర్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, ఎంఈఓ



ఉట్కూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మానవపాడు మండలం జల్లాపురంలో..



కొంకలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అయిజ మండలం ఈడిగోనిపల్లిలో..

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

మానవపాడు: మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికళ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు రక్తహీనత, క్యాన్సర్‌తో పాటు వివిధ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 60 మంది మహిళలను పరీక్షించారు. వైద్యసిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ నరేంద్ర, డాక్టర్ ఇర్షాద్, రిజ్వానా తస్నీర్, సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, సీఎస్‌ఎంం, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య దినోత్సవంలో వైద్యసిబ్బంది

మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయాలి



నాగర్‌దొడ్డి కలుషితమైన నీటిని చూపుతున్న యువకుడు

మల్దకల్: మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను వెంటనే శుభ్ర చేయాలని నాగర్‌దొడ్డి గ్రామస్తులు కోరారు. మంగళవారం నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన యువకులు సంబంధిత మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలు గడుస్తున్నా మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితం అయ్యిందని వివరించారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని యువకులు కోరుతున్నారు.

డిజిటల్ బీపీ యంత్రాల పంపిణీ

రాజోలి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్‌ఎంలకు కొత్త డిజిటల్ బీపీ యంత్రాలను ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు, డాక్టర్ మధుబాబు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త బీపీ యంత్రాలను చార్జింగ్ చేసుకొని స్క్రీనింగ్ చేయాలని సూచించారు. పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి సబ్ సెంటర్‌లోని గ్రామాలలో ఉన్న 30 సంవత్సరాలు పైబడిన పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీపీ యంత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య అధికారులు

చైర్‌పర్సన్‌కు కలెక్టర్ అభినందన

అలంపూర్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతిని మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పట్టణ ప్రగతిలో భాగంగా 2022–23 వార్షిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లలో అలంపూర్ మున్సిపాలిటీకి ప్రథమ స్థానం దక్కింది. దీంతో హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చైర్‌పర్సన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ నిత్యానంద్‌లను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ కలిసి సన్మానించారు.

పత్తి పంట పరిశీలన

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని పత్తి పంటలను మంగళవారం ఇన్‌చార్జ్ ఏఓ శ్రీలత పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పత్తి పంట ఎర్రబడకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మందులను పిచికారి చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ షర్మిల, రైతులు పరమేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, బుడ్డన్న, తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి

శాంతినగర్: ఈనెల 25న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే బహిరంగ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహులుతో కలిసి మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

గద్వాల: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభను విజయవంతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గద్వాల నియోజకవర్గం నుంచి పది వేల మందికి తగ్గకుండా సభకు రావాలన్నారు. జనసమీకరణకు మండలాల వారీగా నాయకులకు లక్ష్యాలను నిర్దేశించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, రవికుమార్, కుమ్మరి శ్రీను, ఆనంద్, కబీర్‌దాస్ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

గద్వాల రూరల్: మల్దకల్ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే పూజ, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ సృజనలను ఆలయ చైర్మన్ ప్రహల్లాద్‌రావు ఆహ్వానించారు. మంగళవారం వారిని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహిస్తునట్లు ఆయన పేర్కొన్నారు.

డీడబ్ల్యూఓకు గ్రామస్తుల ఫిర్యాదు

అయిజ: మండలంలోని బైనపల్లె గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల కిందట కేంద్రం –1 టీచర్ బదిలీపై వెళ్లింది. దీంతో కేంద్రం –2 అంగన్‌వాడీ టీచర్ జరీనాకు రెండు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అధికారులు అప్పగించారు. కాని మొదటి అంగన్‌వాడీ కేంద్రాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్ జరీనాపై డీడబ్ల్యూఓ ముసాయిదాబేగానికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నా సరుకులు, పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై సీడీపీఓ కమలాదేవికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో నాగన్న, ముక్తార్, ఉరకుందు ఉన్నారు.

యూనియన్‌లో చేరిక

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ 327యూనియన్‌లో వివిధ యూనియన్లకు చెందిన 20 మంది ఉద్యోగులు మంగళవారం చేరారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు వెంకట్ రాములు, కార్యదర్శి అశోక్ మాట్లాడారు. ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ 327యూనియన్ బలోపేతం కోసం అందరు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, సెక్రెటరీ దేవేంద్రయ్య, మురళి, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మామిడి కాయల చోరీ

గద్వాల క్రైం: పట్టణ శివారులో రూ.20 వేల విలువ చేసే మామిడి కాయలు చోరీకి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు పద్మావతి తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ పొలంలో మామిడి పంట సాగు చేసుకొని మామిడి కాయలు విక్రయించి జీవనం సాగిస్తున్నది. అయితే గుర్తు తెలియని దుండగులు తోటలోకి చొరబడి మామిడి కాయలను అపహరించారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇంటింటికి బీజేపీ

ధరూరు: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలను ఎలా లబ్ధి పొందాలో అవగాహన కల్పించారు. క్యారీ బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సవారన్న, బీజేపీ నాయకులు రామన్న, జంగం రాజు, రామిరెడ్డి, వెంకటన్న, రవీంద్ర నాయుడు, బడుగు దరెప్ప తదితులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రాజోలి: మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో బుధవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరులకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులు అర్పిస్తారని పేర్కొన్నారు.

అంగన్‌వాడికి కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గల అంగన్‌వాడీ–3 సెంటర్‌లో చిన్నారులకు, బాలింతలకు కుళ్లిపోయిన కోడిగుడ్లను పంపిణీ చేశారని సోషల్ మీడియాలో ఓ పోస్టు చక్కర్లు కొట్టింది. దీనికి స్పందించిన జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణ అధికారి ముషాయిదాబేగం మంగళవారం వెంటనే స్పందించి ఐసీడీఎస్ అధికారులతో కలిసి కొండేరులోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. సంఘటనకు గల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్త, బాధితుల నుంచి ఆరా తీశారు. అనంతరం గుడ్ల కాంట్రాక్టర్‌ను పిలిపించి మొదటి బ్యాచ్‌లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన దాదాపు 1600 గుడ్లను రిటర్న్ పంపించి నూతన గుడ్లను తెప్పించి వెంటనే గ్రామంలోని చిన్నారులకు, బాలింతలకు పంపిణీ చేశారు. దీనిపై సీడీపీఓ సుజాతను సాక్షి వివరణ కోరగా.. వేసవికాలం కావడంతో త్వరగా గుడ్లు కుళ్లిపోయాయని తెలిపారు. సమస్యను పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య, ఎంపీటీసీ ఈరన్న, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



గుడ్లను రిప్లేస్‌మెంట్ చేసి పంపిణీ చేస్తున్న అధికారులు

తహసీల్దార్‌ను అడ్డుకున్న దరఖాస్తుదారులు



తహసీల్దార్ వాహనం ఎదుట నిరసన తెలుపుతున్న దరఖాస్తుదారులు

అయిజ: కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం చేసేందుకు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు విధించింది. దీంతో పది రోజుల నుంచి బీసీ కులాలకు చెందిన వేల మంది కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మంగళవారం చివరి రోజు కావడంతో కుల, ఆదాయ సర్టిఫికెట్‌లు అందకపోవడంతో తహసీల్దార్ బయటకు వెళ్తుండగా కారును అడ్డుకున్నారు. కారు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మీసేవ నిర్వాహకుల తీరువల్లే ఆలస్యం జరుగుతోందని, రూ.1000 ఇస్తేనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దరఖాస్తుదారులకు సర్దిచెప్పినా ససేమిరా అన్నారు. దీంతో తహసీల్దార్ వెనుదిరిగి కార్యాలయంలోకి వెళ్లారు.

వైభవంగా రాములోరి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దత్తుస్వామి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



రాములోరికి కల్యాణ నిర్వహిస్తున్న అర్చకులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య కోరారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో మహిళలకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఓటు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ రమణరావు ఆధ్వర్యంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటింటికి తిరిగి ఓటు ప్రాధాన్యాన్ని వివరించాలన్నారు. డబుల్, మృతిచెందిన వారి ఓట్లను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, ఆర్‌ఐ రజానీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.